



హన్వాడ : చంద్రమ్మతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మహబూబ్‌నగర్ అర్బన్ : పార్టీలో చేరిన వారితో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమైతం

- 70 ఏండ్లు పట్టించుకోని వారు ఇప్పుడేం చేస్తారు..
- కాంగ్రెస్, బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి
- ప్రతిపక్ష నేతల మాటలు నమ్మి మోసపోవద్దు
- ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ, అక్టోబర్ 28 : కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ఆగమైపోతామని, సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలన్నీ ఆగిపోతాయని ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మండలంలోని వేపూర్, రామన్నపల్లి, లింగన్నపల్లి గ్రామాల్లో శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. అడుగడుగునా మంత్రికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. బతుకమ్మలు, గంగిరెద్దులతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ సర్కారు పక్కా హ్యాట్రిక్ కొడుతుందని ధీమా వ్యక్తం చేశారు. 70 ఏండ్లుగా అన్నదాతలను పట్టించుకోని కాంగ్రెస్ నాయకులకు ఇప్పుడు అధికారమిస్తే ఏం చేస్తారని ప్రశ్నించారు. పేదలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని, తనను ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. రూ.ఐదు లక్షల ఆరోగ్యశ్రీని రూ.15 లక్షలకు పెంచుతామని, రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. గ్రామాల్లో చేసిన అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. పొరపాటున కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 24 గంటల కరెంటు పోయి 3 గంటలు మాత్రమే వస్తుందన్నారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని, వారికి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలరాజు, జెడ్పీటీసీలు విజయనిర్మల, రమణారెడ్డి, సర్పంచులు సత్యమ్మ, భారతమ్మ, శ్రీనివాసులు, ఎంపీటీసీ వెంకట్రాములు, సింగిల్‌విండో చైర్మన్, వైస్ చైర్మన్ వెంకటయ్య, కృష్ణయ్యగౌడ్, నాయకులు లక్ష్మయ్య, జంబులయ్య, రాఘవులు, బసిరెడ్డి, ఆనంద్, యాదయ్య, ఖాజాగౌడ్, శ్రీనివాసులు, చెన్నయ్య, నరేందర్, బాలయ్య, సత్యం, కార్యకర్తలు పాల్గొన్నారు.

***ప్రజలకు పథకాలను వివరించాలి..***

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 28 : తొమ్మిదేండ్లల్లో బీఆర్ఎస్ సర్కారు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో మోతీనగర్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు శ్రీకాంత్, సల్మాన్, నాని, రాహుల్, సాయికిరణ్, వినయ్, దీపక్, పర్ష, అంజి, రఘుతోసహా సుమారు 50 మంది యువకులు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పట్టణ నాయకుడు అజయ్ ఉన్నారు.

### అభివృద్ధి చేశావ్.. నీకే మా ఓటు

హన్వాడ మండలంలోని రామన్నపల్లిలో ప్రచారానికి వెళ్లిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో గ్రామానికి చెందిన వృద్ధురాలు చంద్రమ్మ ముచ్చటించింది. జనవరి నుంచి ఆసరా పింఛన్ పెంచుతున్నాం కారు గుర్తుకు ఓటు వేయాలని మంత్రి కోరగా.. 'నువ్వు ఇప్పటివరకు మా గ్రామానికి ఎంతో చేశావ్ బిడ్డా.. ప్రతి గ్రామానికి రోడ్డు వేశావ్.. నువ్వు చల్లగా ఉండాలి బిడ్డా నీకు తప్పా మరెవ్వరికీ ఓటు వేయను..కేసీఆర్ సారు వచ్చిన తరువాత మాకు పింఛన్ పెరిగింది. ఎవరి మీద ఆశ పడకుండా ధైర్యంగా బతుకుతున్నాం. మళ్లీ కేసీఆర్ సారే రావాలి..' అని చంద్రమ్మ మంత్రికి వివరించింది.

***ఆదర్శ పాలనను వివరించిన వాల్మీకి..***

వాల్మీకి.. రామాయణం రాయడం వల్లే రామరాజ్యం, ఆదర్శ పరిపాలన గురించి తెలిసిందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని బోయపల్లి రోడ్డు కొత్తగంజ్ సమీపంలో ఉన్న వాల్మీకి రామాలయంలో వాల్మీకి జయంతి ఉత్సవాలకు హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రామాలయం చాలా చిన్న గుడిసెలో ఉండేదని.. ప్రస్తుతం విశాలమైన స్థలంలో నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రామ్‌లక్ష్మణ్, వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

***స్వరాష్ట్రంలోనే అన్ని రంగాల అభివృద్ధి***

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబర్ 28 : స్వరాష్ట్రంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శనివారం మున్సిపాలిటీలోని మూడో వార్డులో ఉన్న అప్పన్నపల్లి, శ్రీరాం కాలనీ, బీసీ కాలనీలో ప్రచారం చేపట్టారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై ప్రజలు పూలవర్షం కురిపిస్తూ, మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత అప్పన్నపల్లి వద్ద మొదటి ఫ్లై ఓవర్‌ను పూర్తి చేయించామన్నారు. కేవలం 12 నెలల్లో రెండో బ్రిడ్జిని అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇండ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇప్పించామన్నారు. కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కూతురు శ్రీహిత, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేష్, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, ముడా చైర్మన్ వెంకన్న, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు శివరాజ్, కౌన్సిలర్ వనజ, కో ఆప్షన్ సభ్యురాలు జ్యోతి, నాయకులు నగేశ్, శ్రీను, సమద్ ఖాన్, బలరాం, బాలకిషన్ పాల్గొన్నారు.



వీర్‌శెట్టిపల్లిలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె

## మరింత అభివృద్ధికి కారు గెలవాలి

- కాంగ్రెస్‌కు ఓటేస్తే కర్ణాటక గతే.. : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నవాబ్‌పేట, అక్టోబర్ 28 : రాష్ట్రంలో మరింత అభివృద్ధికి కారు, సారు గెలవాల్సిందేనని బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు, జడ్చర్ల ఎమ్మెల్యే డా.సి.లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఫత్తేపూర్ మైసమ్మ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేసి.. అమ్మవారికి ఎమ్మెల్యే మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రుద్రారం గ్రామం నుంచి ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రచారాన్ని ప్రారంభించి.. కొండాపూర్, హజిలాపూర్, రాంసింగ్‌తండా, వీర్‌శెట్టిపల్లి గ్రామాల్లో పర్యటించారు. అడుగడుగునా ఎమ్మెల్యేకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అనంతరం మండలకేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించి, ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లాలంటే మళ్లీ బీఆర్ఎస్ గెలవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే కర్ణాటకలో పట్టిన గతే పడుతుందన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ నాయకుల వాగ్ధానాలకు మోసపోయి అధికారమిస్తే.. రైతులకు కేవలం 3 గంటల కరెంటు మాత్రమే ఇస్తుందన్నారు. పొరపాటున కాంగ్రెస్ గెలిస్తే ఎరువులు, విత్తనాలకు లైన్లలో నిలబడాల్సిన దుస్థితి వస్తుందన్నారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ లక్ష్మారెడ్డిని లక్ష మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. అనంతరం దాయపంతులపల్లిలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు తిరుపతయ్య, సిద్దోటం సర్పంచ్ వసుంధర కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మయ్య, వైస్ చైర్మన్ చందర్‌నాయక్, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చెన్నయ్య, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సర్పంచులు గోపాల్‌గౌడ్, లలితమ్మ, బొజ్జమ్మ, నర్సింహానాయక్, గంగమ్మ, ఎంపీటీసీలు గోపాల్, గోపీకృష్ణ, నాయకులు శీనయ్య, స్వరూప, రాంప్రసాద్, శ్రీను, లక్ష్మి, నాగిరెడ్డి, అబ్దుల్లా, నవనీతరావు, లక్ష్మయ్య, కృష్ణగౌడ్, వెంకటేశ్, అబ్దుల్‌అలీ తదితరులున్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

## కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- కాంగ్రెస్ కుటిలబుద్ధిని వివరించాలి : ఎమ్మెల్యే ఆల

దేవరకద్ర రూరల్ (చిన్నచింతకుంట), అక్టోబర్ 28 : కాంగ్రెస్ నాయకులు పన్నుతున్న కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. చిన్నచింతకుంట మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశానికి జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలోనే ప్రజలంతా సుభిక్షంగా ఉన్నారని, ప్రభుత్వ పథకాలు నేరుగా అందుతున్నాయన్నారు. కార్యకర్తలు నెల రోజులు కష్టపడి పనిచేస్తే.. మీ కోసం 5 ఏండ్లు సేవచేస్తానన్నారు. రైతుబంధు, దళితబంధు వంటి సంక్షేమ పథకాలను ఆపాలని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారని వారి కుటిల బుద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి బీఆర్ఎస్ మ్యానిఫెస్టో గురించి తెలియజేయాలన్నారు. 70 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసింది శూన్యమన్న సంగతి మరిచిపోయి.. ఇప్పుడు మాయమాటలతో మళ్లీ ప్రజలను మోసం చేసి ఓట్లు వేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్‌పై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని, మూడోసారి భారీ మెజార్టీతో విజయం సాధిస్తామన్న నమ్మకం ఉందన్నారు. అనంతరం మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండీ పాషా, మహేశ్, మహేందర్, కురుమూర్తి, రాజు, మధు, విజయ్, బాలరాజు, బాలకొండ, శివ, శ్రీనివాసులుతోపాటు పలువురు బీజేపీ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వరి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాము, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు కరుణాకర్‌రెడ్డి, పీఏసీసీఎస్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దశరథ్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి మరోసారి పట్టం కట్టాలి

- పథకాలు దేశానికే ఆదర్శం : ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేటరూరల్, అక్టోబర్ 28 : నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎంతో డెవలప్‌మెంట్ చేశానని, ప్రజలు ఆలోచించి మరోసారి అభివృద్ధికి పట్టం కట్టాలని నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి కోరారు. మండలంలోని అంత్వార్, అయ్యవారిపల్లి, లక్ష్మీపూర్, బోయిన్‌పల్లి, శేర్నపల్లి, శాసన్‌పల్లి గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం బీఆర్ఎస్ సర్కారు ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. రైతులకు కేవలం మూడు గంటల కరెంట్ సరిపోతుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెబుతున్నారని, దీన్ని బట్టి చూస్తే వారికి సాగుపై ఏ మేరకు అవగాహన ఉందో అర్థమవుతుందన్నారు. కర్ణాటకలో మనవద్ద ఉన్న ఒక్క పథకం కూడా లేదని.. ప్రజలు కాంగ్రెస్‌కు అధికారమిస్తే మొండిచెయ్యి చూపిస్తుందని మండిపడ్డారు. మరి అలాంటప్పుడు మన వద్ద గెలిస్తే ఆరు గ్యారెంటీలు అమలుచేస్తామంటే ఎలా నమ్ముదామన్నారు. పీఆర్ఎల్ఐ సాగునీరు అందించి రైతుల పాదాలు కడుగుతామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న కేసీఆర్ కావాలా.. పూటకొక సీఎం మారే కాంగ్రెస్ కావాలా అనే విషయాన్ని ఆలోచించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ అంజలి, జెడ్పీ కో ఆప్షన్ తాజుద్దీన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లక్ష్మీకాంత్, మాజీ జెడ్పీటీసీ పుష్పలత, రైతు బంధు సమితి జిల్లా స భ్యుడు జగన్మోహన్‌రెడ్డి, మైనార్టీ సంఘం మండలాధ్యక్షుడు అలిశేర్, సర్పంచుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, నాయకులు ఉన్నారు.

## ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

- నిరంతరం ప్రజా సేవలోనే ఉంటా.. : ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



స్వామీజిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చిట్టెం దంపతులు

మక్తల్‌టౌన్, అక్టోబర్ 28 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని, అప్పుడే మానవ జీవితానికి సార్థకత లభిస్తుందని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పర్యటనలో భాగంగా ఉత్తరాదిమఠం స్వామీజి సత్యాత్మతీర్థుల శ్రీపాదుల స్వామి మక్తల్ పట్టణంలోని బ్రాహ్మణ వాడిలో ఉన్న ఉత్తరాదిమఠాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్వామిజీని ఎమ్మెల్యే చిట్టెం, ఆయన సతీమణి చిట్టెం సుచరితారెడ్డి దర్శించుకొని ఆశీస్సులు పొందారు. వేదవిద్యార్థులకు న్యాయసుధ పాఠాలను బోధించి.. మూలరాముల దేవపూజ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో రాఘవేంద్రాచారి, యోగేశాచారి, రాజేశ్వరయ్య, సూరి, శ్రీధర్‌చారి ఉన్నారు.

***భవానీ మాత ఆలయంలో పూజలు***

ఊట్కూర్, అక్టోబర్ 28 : మండలకేంద్రంలోని భవానీ మాత ఆలయంలో దసరా ఉత్సవాల ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవంశీయ క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, హారతి వంటి కార్యక్రమాలు చేపట్టారు. వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి భవానీ మాతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజా సేవలో ఉంటానని, మరింత అభివృద్ధి కోసం కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్, పీఏసీసీఎస్ చైర్మన్ బాల్‌రెడ్డి, సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు అశోక్, నాయకులు నారాయణరెడ్డి, అరవింద్‌కుమార్, లక్ష్మారెడ్డి, శివరామరాజు, హన్మంతు, వెంకటేశ్‌గౌడ్, తరుణ్ పాల్గొన్నారు.

